సాయంత్రమూ విఐపి బ్రేక్..?

'శ్రీవాణి' దర్శనం..ఏరోజుకారోజే.. / ట్రస్టు డిపాజిట్లు రూ.1000 కోట్లు పైమాటే..

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

తిరుమల తిరుపతి దేవస్థానం పాలకమండలి వినూత్న కార్యక్రమాలకు శ్రీకారం చుడుతోంది. విఐపిల తాకిడి పెరగడంతో వారిని బుజ్జగించేందుకు రాష్ట్ర ప్రభుత్వం దర్శన వేళల్లోనూ మార్పులు చేపట్టాలని టిటిడి ఛైర్మన్ బిఆర్ నాయుడుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సూచించినట్లు సమాచారం. ఈ మేరకు సాయంత్రం వేళల్లోనూ విఐపి బ్రేక్ దర్శనాన్ని ప్రవేశపెట్టేందుకు సిద్ధం చేస్తోంది. తొలితగా 'శ్రీవాణి' ట్రస్టు టికెట్ పొందిన భక్తులకు ఈనెల ఒకటో తేదీ నుంచి ఏరోజుకారోజే శ్రీవారి దర్శనం చేసుకునేందుకు అవకాశం కల్పించింది. అయితే సాయంత్రం 5.30 గంటల నుంచి 7 గంటల వరకూ ఒక విడత, రాత్రి ఏడు గంటలకు శ్రీవారికి నైవేద్యం తరువాత మరో విడత 'శ్రీవాణి' ట్రస్టు భక్తులకు అవకాశం కల్పిస్తున్నారు. ఇది సక్సెస్ కావడంతో సిఫార్సు లేఖల ద్వారా వచ్చే వారికి ఉదయం పూటే కాకుండా సాయంత్రం వేళల్లోనూ వారికి అవకాశం కల్పించే యోచన చేస్తున్నారు.

శ్రీవాణి ట్రస్టు డిపాజిట్లు రూ.1000 కోట్లు

శ్రీవాణి ట్రస్టు స్థాపించి ఐదేళ్లు కావస్తోంది. దీని ముఖ్య ఉద్దేశ్యం విఐపి బ్రేక్ కావాలన్న సామాన్య భక్తులు ఎవరైనా రూ.10వేలు శ్రీవారికి డొనేషన్, రూ.500 విఐపి బ్రేక్ టికెట్ పొంది టికెట్ తీసుకున్న మరుసటిరోజు ఉదయం విఐపి బ్రేక్ సమయంలో శ్రీవారిని దర్శించుకోవచ్చు. ఇది ఆనవాయితీ. దీనిద్వారా ఇప్పటివరకూ వెయ్యి కోట్లు ఆదాయం శ్రీవాణి ట్రస్టు ద్వారా వచ్చినట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. ఈ ఆదాయాన్ని హిందూ సనాతన ధర్మం ప్రచారం కోసం, దళిత గిరిజన, పల్లె ప్రాంతాల్లో శ్రీవారి ఆలయాలు, రామాలయాలు, శ్రీకృష్ణ మందిరాలు, ఇతర హిందూ దేవాలయాలు నిర్మించేందుకు వినియోగించాలన్నది ముఖ్య ఉద్దేశ్యం. గత వైసిపి హయాంలో అప్పటి పాలకమండలి అధ్యక్షులు వైవి సుబ్బారెడ్డి, భూమన కరుణాకర్‌రెడ్డిలు 137 కోట్లు ఆలయాలు నిర్మించేందుకు శ్రీవాణి నిధులను కేటాయించారు. కూటమి హయాంలోనూ ప్రస్తుత పాలకమండలి ఛైర్మన్ బిఆర్ నాయుడు 17 కోట్లు నిధులు మంజూరు చేశారు. 137 కోట్లు రాష్ట్రవ్యాప్తంగా ఆలయాలకు ఖర్చు చేశారు. అయితే ఆయా ప్రాంతాల్లోని దేవాదాయ ధర్మాదాయ శాఖ ఈవోల యుటిలిటి సర్టిఫికెట్లు ఇవ్వాల్సి ఉంది. ఈ మేరకు గత ప్రభుత్వం ఖర్చు చేసిన 137 కోట్లకు సంబంధించిన లెక్కలను దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రాంనారాయణరెడ్డి టిటిడిని కోరినట్లు సమాచారం. ఈ మేరకు రూ.137 కోట్లకు సంబంధించిన నిధుల ఖర్చులను తెప్పించే పనిలో టిటిడి అధికారులు నిమగ్నమై ఉన్నారు. అలాగే చిత్తూరు జిల్లా కుప్పం నియోజకవర్గంలో 10 ఆలయాలు, పలమనేరు, జీడీనెల్లూరు నియోజకవర్గాల్లో మరో 10 ఆలయాలకు జూన్ నెలలో జరిగిన బోర్డులో రూ.17 కోట్లు కేటాయించి వెచ్చించనున్నారు. శ్రీవాణి ట్రస్టు ఆదాయం రోజురోజుకూ పెరుగుతుండడంతో టికెట్లను ప్రస్తుతం ఆన్‌లైన్‌లో రోజుకు 500, తిరుమల, తిరుపతి ఎయిర్‌పోర్టు ఆఫ్‌లైన్‌లో 1000 టికెట్లను మంజూరు చేస్తుండటం గమనార్హం. సాయంత్రం విఐపి బ్రేక్ సక్సెస్ అయితే తిరుమలలో మరో 500 టికెట్లను ఇచ్చేందుకు అధికారులు నిర్ణయించారు. నవంబర్ 1 వరకూ ఆన్‌లైన్‌లో బుక్ చేసుకున్న భక్తులకు మాత్రం ఉదయం విఐపి దర్శనం మాత్రమే అవకాశం ఉంటుంది. ఆపైన బుక్ చేసుకునే శ్రీవాణి ట్రస్టు భక్తులకు ఉదయం, సాయంత్రం వేళల్లో శ్రీవారిని దర్శించుకునే అవకాశాన్ని టిటిడి కల్పించనుంది.

'ఓటు హక్కు'ను హరించొద్దు : సిపిఎం

'ఎస్ఐఆర్' ప్రజాస్వామ్య వ్యవస్థకు ప్రమాదం

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ఎన్నికల పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థకు తీవ్ర ప్రమాదం.. దొడ్డిదారిన అమలు చేసి ఓటు హక్కును హరించొద్దు' అంటూ సిపిఎం జిల్లా ప్రధాన కార్యదర్శి వందవాసి నాగరాజు అన్నారు. హోంమంత్రి ఆదేశాలతో ఓటరు జాబితాను మార్చేసి లక్షలాది మందికి ఓటు హక్కు నిరాకరించి బిజెపికి లబ్ధి చేకూర్చేందుకే ఈ ఎస్ఐఆర్‌ను అమలు చేయడానికి ప్రయత్నిస్తున్నారన్నారు. ఇది ఒక్క బీహార్‌కే పరిమితం కాదని, రాబోయే రోజుల్లో దేశమంతా అమలు చేయడానికి ప్రయత్నిస్తారన్నారు. దీన్ని పార్టీలకు అతీతంగా వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. తిరుపతి పాత మున్సిపల్ కార్యాలయం వద్ద సిపిఎం ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన చేపట్టారు. వి.నాగరాజు మాట్లాడుతూ రెండు నెలల్లో ఎన్నికలు జరగనున్న బీహార్లో ఈ ప్రత్యేక పరిశీలన లక్ష్యం ఆ రాష్ట్రంలో ఎన్డీయే కూటమి అధికారాన్ని నిలబెట్టుకోవడం కోసం మాత్రమే కాదని, బిజెపి ఆర్ఎస్ఎస్ మతతత్వ అజెండా అమలులో ఇది కీలక పరిణామం అన్నారు. గతంలో ప్రజలు తిరస్కరించిన పౌరసత్వ చట్ట సవరణ (సిఎఎ)ను, జాతీయ పౌరసత్వ రిజిష్టర్ (ఎన్ఆర్‌సి)ను దొడ్డిదారిన ఎస్ఐఆర్ పేరుతో అమలు చేయడానికి కేంద్రం సిద్ధమయ్యిందన్నారు. ఎస్ఐఆర్‌ను వ్యతిరేకించాలన్నారు. ఈ కార్యక్రమంలో టి.సుబ్రమణ్యం, వేణు, మునిరాజ తదితరులు పాల్గొన్నారు.

- **పుత్తూరు టౌన్‌లో..** అంబేద్కర్ సర్కిల్ వద్ద శుక్రవారం ధర్నా నిర్వహించారు. సిపిఎం జిల్లా నాయకులు ఆర్.వెంకటేష్ మాట్లాడుతూ స్వతంత్రంగా వ్యవహరించాల్సిన రాజ్యాంగ వ్యవస్థ ఎన్నికల సంఘం, హోంమంత్రి ఆదేశాలతో ఓటరు లిస్టును మార్చేసి లక్షలాది మందికి ఓటు హక్కు నిరాకరించి బిజెపికి రాజకీయ లబ్ధి చేకూరుస్తోందన్నారు. ఈ ప్రత్యేక సునిశిత లక్ష్యం బీహార్లో ఎన్నికలు జరగపోతున్న నేపథ్యంలో ఎన్డీఏ కూటమి అధికారాన్ని నిలబెట్టుకోవడం మాత్రమే కాదని, బిజెపి, ఆర్ఎస్ఎస్ మతతత్వ అజెండా అమలులో కీలక పరిణామం అన్నారు. సిపిఎం నాయకులు సుబ్రమణ్యం పిళ్లై, మోసెస్ పాల్గొన్నారు.
- **శ్రీకాళహస్తిలో** పెండ్లిమండపం వద్ద సిపిఎం జిల్లా నాయకులు అంగేరిపుల్లయ్య, ప్రాంతీయ కార్యదర్శి గంధం మణి, గురవయ్య, వెంకటేష్ ఆధ్వర్యంలోజరిగింది.
- **రేణిగుంటలోనూ** అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం నాయకులు హరి, ఒ.వెంకటరమణ ఆధ్వర్యంలో నిర్వహించారు.

తిరుపతి పాత మున్సిపల్ కార్యాలయం వద్ద ఎస్ఐఆర్‌ను వ్యతిరేకిస్తూ నిరసన కార్యక్రమం

సాకారం కాని 'పోలీస్ అవుట్ పోస్ట్'

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రి భద్రత దష్ట్యా పోలీస్ అవుట్ పోస్ట్ అవసరం అక్కడ ఉంది. గతంలో జరిగిన కొన్ని సంఘటనల నేపథ్యంలో ఆసుపత్రి యాజమాన్యం నుంచి ఈ డిమాండ్ మరింత పెరిగింది. ఈ క్రమంలోనే ఇటీవల ఏరియా ఆసుపత్రి సందర్శనకు వచ్చిన శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి తక్షణమే ఏరియా ఆసుపత్రి వద్ద పోలీస్ అవుట్ పోస్టును ఏర్పాటు చేయాల్సిందిగా శ్రీకాళహస్తి డిఎస్పిని ఆదేశించారు. అయితే పక్షం రోజులు గడుస్తున్నా ఇప్పటివరకు ఆచరణ సాధ్యం కాలేదు. సిబ్బంది కొరత కారణంగానే పోలీస్ అవుట్ పోస్టును ఏర్పాటు చేయలేకున్నామని పోలీసు అధికారులు చెబుతున్న మాట. అయితే ఏరియా ఆసుపత్రికి వెళ్లే దారితో పాటు, పరిసర ప్రాంతాల్లో కొందరు ఆకతాయిలు నిత్యం గంజాయి, మద్యాన్ని తాగి గొడవలు పడుతున్నారు. అటుగా వెళ్లే కాలేజీ, స్కూల్ విద్యార్థినులతో పాటు రోగుల బంధువులపై ఈవ్ టీజింగ్‌కు పాల్పడుతున్నారు. దీంతో ఆసుపత్రి యాజమాన్యం మరింత కంగారుపడుతున్న పరిస్థితి కనిపిస్తోంది. ఇకనైనా పోలీస్ అవుట్ పోస్టును ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

గస్తీ ఏర్పాటు చేయండి: కాంగ్రెస్

శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రికి వెళ్లే దారిలో పోలీసు గస్తీ ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ పార్టీ శ్రీకాళహస్తి నియోజకవర్గం తలపా దామోదర్ రెడ్డి శుక్రవారం శ్రీకాళహస్తి డిఎస్పీ నరసింహామూర్తికి వినతి పత్రం అందజేశారు. ఈ దారిలో కాలేజీలు, స్కూళ్లు, ప్రభుత్వ ఆసుపత్రి ఉన్నాయన్నారు. మద్యం మత్తులోని కొందరు యువకులు ఈ దారిలో వెళ్లే విద్యార్థినులు, మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నారని దామోదర్ రెడ్డి వాపోయారు. ఏరియా ఆసుపత్రి వద్ద పోలీసు అవుట్ పోస్టును ఏర్పాటు చేస్తే ఆకతాయిల ఆగడాలకు అడ్డుకట్టు వేయచ్చని సూచించారు.

ఆటోమ్యుటేషన్..అంతంతమాత్రమే..!

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

రిజిస్ట్రేషన్ జరిగిన వెంటనే ఆస్తి యాజమాన్య హక్కు బదలాయింపు (మ్యుటేషన్) విధానం అమలులో సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నాయి. ఈ నెల 1 నుంచి 17 నగరపాలక సంస్థల పరిధిలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఆటోమ్యుటేషన్ విధానాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టింది. అయితే సబ్ రిజిస్ట్రార్, మున్సిపల్ కార్పొరేషన్ల వద్ద ఉన్న వివరాల్లో డోర్, వార్డు, బ్లాక్ నంబర్ల పరంగా చాలాచోట్ల అనుసంధానం కాలేదు. ఆటోమ్యుటేషన్కు ఇది ప్రధాన అవరోధంగా మారింది. ఫలితంగా మొత్తం రిజిస్ట్రేషన్లలో 20-30 శాతం లావాదేవీలకు మాత్రమే పేర్లు మారుతున్నాయి. మిగి లిన డాక్యుమెంట్లలో పేర్లు మారడం లేదు. ఎసెస్ మెంట్ నంబరు కలిగి, రిజిస్ట్రేషన్ (సేల్, గిఫ్ట్, పార్టిషన్) జరిగిన ఇళ్లు, కొత్త ప్లాట్లకు ఆస్తి పన్ను చెల్లింపు రశీదులో కొనుగోలు చేసిన వ్యక్తి పేరు వచ్చేలా ప్రభుత్వం మార్పులు చేపట్టింది.

ఇంటి నంబర్లలో ఏకత్వం లేని ఫలితం..

రిజిస్ట్రేషన్ల శాఖ ఆటోమేటిక్ మ్యుటేషన్ విధానాన్ని ఆగస్టు నెలలో ప్రయోగాత్మకంగా ప్రవేశపెట్టింది. అమలు తీరును పరిశీలించాక ఆగస్టు 1 నుంచి 17 నగరాలకు విస్తరించింది. ఈ కొత్త విధానంలో సదరు ఆస్తికి సంబంధించిన అన్ని బకాయిలు చెల్లిస్తేనే రిజిస్ట్రేషన్ అయ్యేలా చర్యలు తీసుకున్నారు. డోర్ నంబర్లకు అనుగుణంగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల సిబ్బంది మార్కెట్ విలువను ఖరారు చేస్తు న్నారు. మున్సిపల్ కార్పొరేషన్ల వద్ద కూడా వివరాలు ఇంతే కచ్చితంగా ఉంటాయని భావించారు. అయితే, మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు డోర్ నంబర్ల కేటా యింపులో అనుసరించిన విధానం ఒక్కోచోట ఒక్కో రకంగా ఉంది. వార్డు, బ్లాక్, డోర్ నంబరు కలిపి ఒక నంబరు కింద ఇస్తున్నారు. అంకెల మధ్య ఫుల్‌స్టాప్, నిలువుగీత లేదా అడ్డగీతలు వంటివి ఉన్నాయి. తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో రెవెన్యూ వార్డు, వార్డు నెంబరు, ఇంటి నెంబరు వేరువేరుగా ఉండడం వల్ల మ్యుటేషన్ కొంత ఇబ్బందులు అయితే తిరుపతిలో ఉన్నాయి. మ్యుటేషన్ ఎక్కువగా జరగడం లేదు. రోజుకు 10 నుంచి 15 జరుగుతున్నాయి. మ్యుటేషన్ ఈ నంబర్ల నమోదులోనూ ఒకే కార్పొరేషన్ పరిధిలో రకర కాల పద్ధతులు అవలంబించారు. రాష్ట్రంలో కొన్ని కార్పొరేషన్‌లలో ఈ సమస్య తీవ్రంగా ఉంది. దీంతో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఆస్తుల రిజిస్ట్రేషన్లు జరుగుతున్నా. సాంకేతిక సమస్య లతో ఆటో మ్యుటేషన్ కావడం కావడం లేదు. కొత్త యజమాని పేరు రికార్డుల్లోకి చేరడంలేదు. ఫలితంగా వీరు పాత పద్ధతిలోనే రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయ్యాక సబ్ రిజి స్ట్రార్ కార్యాలయాల్లో ఇచ్చే డాక్యుమెంట్లతో మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయాన్ని సందర్శిస్తున్నారు

సాంకేతిక సమస్యలతో మారని పేర్లు
అనుసంధానం20-30శాతమే...

పురపాలక లాగిన్‌కు సమాచారం

రిజిస్ట్రేషన్ సమయంలో ఆస్తికి సంబంధించిన ఇంటి, నీటి పన్నుల బిల్లులు పొందుపర చాలి. లేకుంటే రిజిస్ట్రేషన్కు స్లాట్ బుకింగ్ పొందే అవకాశం ఉండదు. ఖాళీ స్థలం అయినా పన్ను రసీదు తప్పనిసరి. పన్ను బకాయిలు చెల్లిస్తేనే ఈ పద్ధతిలో రిజిస్ట్రేషన్ సాధ్యమవుతుంది. అన్నీ పక్కాగా జరిగాక కొనుగోలుదారుల పేరుతో పన్ను మార్చాలని రిజిస్ట్రేషన్ కార్యాలయం నుంచి మున్సిపల్ లాగిను సమాచారం వెళ్తుంది. అక్కడ ఆన్లై న్ లో ఆమోదం తెలపగానే ఆటో మ్యుటేషన్ ధ్రువపత్రంతోపాటు ఆస్తి పత్రాలు తీసుకో వచ్చు. మార్కెట్ విలువ, విస్తీర్ణం మేరకు మ్యుటేషన్ ఛార్జీలు నిర్ణయిస్తారు

సమస్యను అధిగమిస్తాం

శివకుమార్, జిల్లా రిజిస్ట్రేషన్ శాఖ అధికారి

మ్యుటేషన్ కి సంబంధించిన సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దష్టికి తీసుకెళ్లాం. సమస్యను అధికమించడానికి ప్రయత్నాలు చేస్తున్నాం. సాంకేతిక ఇబ్బందులు రాకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నాం.

75 కేజీల ఎక్స్పైరీ పదార్థాలు ధ్వంసం

స్వీట్ స్టాల్స్‌లో 'ఫుడ్ సేఫ్టీ' తనిఖీలు

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

ఆంధ్ర ప్రదేశ్ ఫుడ్ సేఫ్టీ కమిషనర్ వీరపాండ్య, లీగల్ మెట్రాలజీ కంట్రోలర్ వారి ఆదేశాల మేరకు తిరుపతి పరిధిలో స్వీట్స్ అండ్ బేకరీస్ పై జాయింట్ కంట్రోలర్ లీగల్ మెట్రాలజీ అధికారులు ఆధ్వర్యంలో 17 బందాలుగా ఏర్పాటు చేసి 35 వివిధ రకాల స్వీట్స్ బేకరీస్ దుకాణాలలో శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో భాగంగా 31 ఆహార పదార్థాలను శాంపుల్స్ గా సేకరించి, విశ్లేషణ నిమిత్తం లాబరేటరీ పంపించారు. ఎఫ్ఎస్ఎస్ఐ లైసెన్స్ నిబంధన ఉల్లంఘించి, పరిశుభ్రత పాటించని రేణిగుంటలో ఉన్న ఎఫ్పి ఫుడ్ ఫైనాన్స్ బేకరీ ఫుడ్స్ కి నోటీసు ఇచ్చి సీజ్ చేశారు. టూటీ ఫ్రూటీ తయారీని పరిశుభ్రత లేని కారణంగా కేసు నమోదు చేశారు. ఈ తనిఖీలలో భాగంగా సుమారు 75 కేజీలు ఎక్స్పైరీ, పాడైన ఆహార పదార్థాలను సీజ్ చేసి ధ్వంసం చేశారు. ఆహార నమూనా పరీక్ష ఫలితాలు వచ్చిన వెంటనే

చట్టపరమైన చర్యలు చేపడుతామని అధికారులు తెలిపారు. ఈ తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని తిరుపతి జిల్లా అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ జీ వెంకటేశ్వరరావు, స్టేట్ జాయింట్ ఫుడ్ కంట్రోలర్ అండ్ పూర్ణచంద్రరావు తెలియజేశారు. ఈ తనిఖీలలో వివిధ జిల్లాల ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ అధికారులు, ఆహార భద్రత, కల్తీ నిరోధక అధికారులు, లీగల్ మెట్రాలజీ అధికారులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్రజాశక్తి - తిరుపతి సిటి

తిరుపతి పరిధిలో సౌత్ సెక్షన్, ఈస్ట్ సెక్షన్ , రూరల్ మంగళం సెక్షన్, రాజీవ్ నగర్ సెక్షన్ లో గల 33/11 కె.వి. కేన్సస్ ఫీడర్ , 33/11 కె.వి. శెట్టి పల్లి ఫీడర్ , 33/11 కె.వి.ముని రెడ్డి నగర్ ఫీడర్ మెయింటెనెన్స్ మరమ్మతులు కారణంగా పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఎస్పీడీసీఎల్ తిరుపతి టౌన్ ఈఈ విన్నకోటిచంద్ర శేఖర్ రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్తు సరఫరా అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు రైల్వే స్టేషన్ , రెండవ సత్రం, గాంధీపురం, వెంకట రెడ్డి కాలని, గ్రీన్ పార్క్ అపార్ట్మెంట్, ఓల్డ్ తిరుచానూరు రోడ్డు, టి.ఎన్ పాలెం, బి.టీ.ఆర్ కాలని, డి.మార్ట్ ఏరియా, పి.డి. నగర్, మంగళం క్వార్టర్స్ , బొమ్మల క్వార్టర్స్, తిరుమల నగర్, శెట్టి పల్లి విలేజ్ , మధుర నగర్, రైల్వే కాలని, సుందరయ్య నగర్, టిటిడి ఏడి బిల్డింగ్, మునిరెడ్డి నగర్ , పద్మావతీ నగర్, గాయత్రి నగర్, ఎస్.వి. నగర్, శ్రీకృష్ణనగర్, ఎల్‌బి నగర్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

వినుతకు బెయిల్

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

మాజీ డ్రైవర్ శ్రీనివాసులు అలియాస్ రాయుడు హత్య కేసులో మాజీ జనసేన పార్టీ శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇంచార్జి కోటా వినుతకు శుక్రవారం చెన్నై సెషన్స్ కోర్టు షరతులతో కూడిన బెయిలును మంజూరు చేసింది. రాయుడు హత్య కేసులో వినుత ఏ-3గా ఉన్నారు. గత నెల 8వ తేదీన ఆమెను చెన్నై సెవెన్ వెల్స్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్ కు తరలించారు. సరిగ్గా నెల రోజుల అనంతరం చెన్నై సెషన్స్ కోర్టు ఆమెకు షరతులతో కూడిన బెయిలును మంజూరు చేసింది.

రుణాలిస్తాం రండి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

కేంద్ర ప్రభుత్వ పథకాల కింద వ్యాపారులకు సకాలంలో రుణాలు ఇస్తామని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా శ్రీకాళహస్తి ప్రధాన బ్రాంచి మేనేజర్ ఫణి కుమార్, ఏడీబీ శాఖ చీఫ్ మేనేజర్ మోహన్ రాజు పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణంలో రుణ మేళా నిర్వహించారు. వ్యాపారస్తుల జిఎస్టి, ఐటి రిటర్న్ల ఆధారంగా కేంద్ర ప్రభుత్వ పథకాలు ప్రధానమంత్రి ముద్ర యోజన, ప్రధాన మంత్రి ఎంప్లాయ్ మెంట్ జనరేషన్, బిజినెస్ రూల్ ఇంజిన్ కింద రూ. 2 కోట్ల వరకు రెండు గంటల వ్యవధిలోనే మంజూరు చేస్తామని స్పష్టం చేశారు. ఎలాంటి ఆస్తి తనఖా లేకుండా రుణం అందిస్తామనీ, పట్టణంలోని వ్యాపారస్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

భాకరాపేట ఘాట్ ఫ్లైఓవర్ నిర్మాణానికి లైన్ క్లియర్

వన్య ప్రాణులకు ఆటంకం లేకుండా నిర్మాణం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

చంద్రగిరి నియోజకవర్గం భాకరాపేట ఘాట్ రోడ్డు లో ఫ్లైఓవర్ నిర్మాణానికి కేంద్ర పర్యావరణ, అటవీ వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ నుండి ఫైనల్ లైన్ క్లియరెన్స్ అనుమతులు లభించాయని తిరుపతి జిల్లా అటవీ శాఖ అధికారి వివేక్ ఆనంద్ తెలిపారు. తిరుపతి-బళ్ళారి జాతీయ రహదారి పీలేరు - కాలూరు సెక్షన్ జాతీయ రహదారి 71 లో నాలుగు లేన్ల రహదారిని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం భారతమాల పరియోజన కింద వన్యప్రాణులు దాటడానికి, వాహనాల రాకపోకలు సాగించడానికి కేంద్ర ప్రభుత్వం అనుమతి కోరింది. 2021 నవంబర్ 25న నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా వారి ప్రతిపాదనకు ఇటీవల కేంద్ర పర్యావరణ అటవీ వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ నిర్మాణంకు గ్రీన్ సిగ్నల్ ఇస్తూ అనుమతులు ఇచ్చిందన్నారు. భాకరాపేట ఘాట్ అత్యంత ప్రమాదకరమైన మలుపులతో కూడి నిత్యం ప్రమాదాలు జరుగుతూ ప్రాణాలు కోల్పోవడం జరుగుతోంది. దీనిపై గత వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ హాయంలో 150 మీటర్ల రక్షణ గోడను నిర్మించారు. ప్రస్తుతం ప్రమాదాలను నివారించాలని తలచిన కూటమి ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వంతో సంప్రదింపులు చేసి సురక్షితమైన ప్రయాణాల సౌకర్య కల్పనలో భాగంగా, 15 అడుగుల ఎత్తులో ఫ్లైఓవర్ భాకరాపేట ఘాట్ రోడ్డులో నిర్మించనున్నారు. ఈ ఫ్లైఓవర్ నిర్మాణం ద్వారా వన్యప్రాణులకు వాహనాల వలన ఎటువంటి ఇబ్బంది కలగకుండా వెళ్లే అవకాశం ఉంది.

టిటిడి అనుబంధ ఆలయాల్లో 'సౌభాగ్యం'

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

టిటిడి, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో ఆగష్టు 8వ తేదీ వరలక్ష్మీ వ్రతం సందర్భంగా 52 టిటిడి అనుబంధ ఆలయాలలో సౌభాగ్యం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సౌభాగ్యవతులకు గాజులు, పసుపు, కుంకుమ, అక్షింతలు, పుస్తక ప్రసాదాలు అందించారు. ఏపీ, తెలంగాణ రాష్ట్రాలలోని తిరుచానూరు, నారాయణవనం , శ్రీకాకుళం, కార్వేటినగరం, దేవుని కడప, ఒంటిమిట్ట, హైదరాబాద్, సీతంపేట, పిఠాపురం, కీలపట్ల, అనంతవరం, రాజాం, సరిమల్లె, అమరావతి, విజయవాడ తదితర 52 ఆలయాల్లో సౌభాగ్యం కార్యక్రమం జరిగింది. దాతల సహకారంతో 8 లక్షల గాజులు, 1.60 లక్షల కంకణాలు, 1.60 లక్షల పసుపు దారాలు, 1.60 లక్షల అమ్మవారి కుంకుమ ప్యాకెట్లు, అమ్మవారి లక్ష్మీ అష్టోత్తర శత నామావళి పుస్తక ప్రసాదాలను అందించారు.

స్వర్ణరథంపై శ్రీ పద్మావతి అమ్మవారు

తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి వరలక్ష్మీ వ్రతం సందర్భంగా శుక్రవారం స్వర్ణరథంపై ఆశీనులై భక్తులను కటాక్షించారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని తన్మయత్వంతో నాలుగుమాడ వీధుల్లో రథాన్ని లాగారు. కర్పూర హారతులు సమర్పించి అమ్మవారిని దర్శించుకున్నారు. స్వర్ణరథోత్సవంలో ఈవో జె. శ్యామల రావు దంపతులు, జేఈవో వి వీరబ్రహ్మం, డిప్యూటీ ఈవో హరీంద్రనాథ్, సూపరింటెండెంట్ శ్రీవాణి, విశేషసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

తిరుపతి రైల్వే స్టేషన్లో యాత్రికులపై ఆటో డ్రైవర్ల దాడి

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

తిరుపతి రైల్వే స్టేషన్ సమీపంలో ఆటో డ్రైవర్లు మూక్కుముడిగా యాత్రికులపై దాడి చేసిన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. తిరుమల వెళ్లేందుకు తిరుపతికి నిత్యం కొన్ని వేలమంది వివిధ ప్రాంతాల నుంచి భక్తులు వస్తూ ఉంటారు. తిరుపతి రైల్వే స్టేషన్ నిత్యం రద్దీగా ఉంటుంది, తిరుపతి రైల్వే స్టేషన్ సమీపంలో శ్రీనివాస మంగాపురం, శ్రీవారి మెట్టుకు ఫ్రీ బస్‌లో వెళ్ళేందుకు బస్ స్టాప్ వుంది. ఈ బస్ స్టాప్ వద్ద శుక్రవారం ప్రయాణికులు కొందరితో ఆటోడ్రైవర్లు వాగ్విదానికి దిగారు. అనంతరం ఓ భక్తుడి పై ఆటో డ్రైవర్లు మూకుమ్మడిగా దాడికి దిగి, పిడి గుద్దులు గుద్దారు. బాధితుడి పక్కనే ఉన్న కుటుంబ సభ్యుల్లోని మహిళలు, చిన్నపిల్లలు భయాందోళనకు గురై ఏడుస్తూ తమ తండ్రిని కొట్ట వద్దని ప్రాధేయపడుతున్నా, పట్టించుకోకుండా చితక బాదారు. ఆటో డ్రైవర్లు మూకుమ్మడిగా దాడి చేస్తున్న వీడియోలు ఇప్పుడు సంచలనంగా మారాయి, దాడికి ప్రధాన కారణం, ఆటో డ్రైవర్ చెప్పినంత డబ్బులు యాత్రికులు ఇవ్వలేమన్నందుకు వాగ్వివాదం మొదలైనట్టు స్థానికులు పేర్కొన్నారు. తిరుపతిలో అనేక నేరాలు వెలుగు చూస్తున్న క్రమంలో నిన్ననే ఓ యువకుడుని చితకబాదిన ఘటన

మరువకముందే, ఈరోజు యాత్రికులపై దాడి జరగడంతో తిరుపతిలో నేరస్తుల పై పోలీసులు కఠిన వైఖరి వ్యవహరించాలని స్థానికులు,యాత్రికులు కోరుతున్నారు.

రుతుపవనాల ప్రభావం తిరుపతిలో ప్రతిరోజూ ఉదయం ఎండ వాయిస్తుంటే.. సాయంత్రాల్లో వాన దంచి కొడుతోంది.. దాదాపు పక్షం రోజులుగా ఇదే వాతావరణం తిరుపతి జిల్లాలో నెలకొంది. ఈ వర్షానికి పచ్చనిపైర్లు కళకళలాడుతుంటే, చెరువులు నీటితో నిండి శోభాయమానంగా ఉన్నాయి. (ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో)

కూటమి ప్రభుత్వం మహిళలకు కుచ్చు టోపీ

- తిరుపతి మేయర్ డాక్టర్ శిరీష

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : ఎన్నికల సందర్భంగా కూటమి నాయకులు మహిళలకు ఇచ్చిన హామీలకు ఆంక్షలు పెట్టి మహిళలను కూటమి ప్రభుత్వం మోసం చేసిందని తిరుపతి నగరపాలక సంస్థ మేయర్ డాక్టర్ శిరీష విమర్శించారు. స్థానిక పద్మావతి పురంలోని వైఎస్ఆర్‌సిపి కార్యాలయంలో శుక్రవారం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ రాష్ట్ర మహిళలకు అన్నీ బస్సులలో అన్ని ప్రాంతాలకు ఉచిత ప్రయాణం కల్పిస్తామని ఎన్నికలలో హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం, దాన్ని అమలు చేయకుండా కాలయాపన చేసిందన్నారు. వైసిపి అధినేత జగన్మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో పోరాటాలు చేయడంతో ప్రభుత్వం ఎట్టికేలకు దిగివచ్చి ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత ప్రయాణం అవకాశం కల్పిస్తున్నట్లు క్యాబినెట్లో ప్రకటించిందని గుర్తు చేశారు. ప్రభుత్వం గత 14 నెలలుగా ఈ పథకాన్ని అమలు చేయకుండా ఎందుకు ఆలస్యం చేస్తుందో మహిళలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఆగస్టు 15 నుంచి అమలు చేయనున్న ఈ శ్రీ శక్తి పథకం అమలును అంచెలంచెలుగా చేపట్టడం విడ్డూరంగా ఉందన్నారు. మద్యం అమ్మ కాలను ప్రభుత్వం ఆదాయ వనరుగా భావించి, విచ్చలవిడిగా మద్యం దుకాణాలు ఏర్పాటు చేసి దానికి అనుగుణంగా బెల్ట్ షాపులు సైతం ఏర్పాటు చేస్తుందన్నారు. ప్రభుత్వానికి మద్యం ద్వారా భారీగా ఆదాయం సమకూర్చుకోవాలని కూటమి ప్రభుత్వం ఆలోచించడం దారుణమన్నారు. చంద్రబాబు నాయుడు ప్రభుత్వం మహిళలను పూర్తిగా మోసం చేసిందని దుయ్యబట్టారు. ఈ సమావేశంలో వైసిపి మహిళ నాయకురాలు గీత యాదవ్, కుసుమ తదితరులు పాల్గొన్నారు.

కనకదుర్గకు కలిశం బహూకరణ

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: స్థానిక కనకదుర్గమ్మ ఆలయానికి సీనియర్ పాత్రికేయులు చుక్కల సుబ్బారావు కుటుంబం శుక్రవారం కలిశాన్ని బహూకరించారు. కనకదుర్గమ్మ ఆలయ ప్రధానార్చకులు తులసి స్వామి చెంగల్ రాయులుకు కలిశాన్ని అందజేసి అమ్మవారి అభిషేక కార్యక్రమాల్లో వినియోగించవలసిందిగా కోరారు. చుక్కల వెంకటలక్ష్మి, చుక్కల పవన్ కుమార్, చుక్కల సునీత, చుక్కల కీర్తన పాల్గొన్నారు.

విద్యుత్ దోపిడీని అరికట్టాలి : సీపీఎం



ప్రజాశక్తి - గూడూరు టౌన్ : విద్యుత్ దోపిడీని అరికట్టాలి, ప్రజలపై భారాలు మోపే స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని, సీపీఎం ప్రాంతీయ కార్యదర్శి జోగి శివ కుమార్ డిమాండ్ చేశారు. పట్టణంలోని పలుప్రాంతాలకు వెళ్లి స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా కర పత్రాల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ విద్యుత్ సంస్థలను కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టేందుకు పూనుకుందన్నారు. స్మార్ట్ మీటర్లు పెడితే బద్దలు కొట్టండి అన్న మంత్రి లోకేష్, అధికారంలోకి వచ్చాక మాట మార్చారని ఎద్దేవా చేశారు. ప్రజలను చైతన్యవంతులను చేసి, ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అడపాల ప్రసాద్, ఎంబేటి చంద్రయ్య, గండికోటి మధు, బి.చంద్రయ్య, సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

పుత్తూరులో గాలివాన

గాలివానకు విరిగి పడ్డ వృక్షం, దెబ్బతిన్న చెట్టుకింద ఉన్న కార్లు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ :గురువారం రాత్రి కురిసిన గాలి, వానతో పుత్తూరు మున్సిపాలిటీ 15వ వార్డు రామారావు కాలనీలో సుమారు 80 సంవత్సరాల భారీ వేపచెట్టు శుక్రవారం కూలిపోయింది. చెట్టు కింద నిలిపిన మూడు కార్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. ఈదురు గాలికి విద్యుత్ తీగలు తెగిపోవడంతో అధికారులు వెంటనే సరఫరా నిలిపివేశారు. ఎంవీ రోడ్డులో వర్షానికి జలమయం కావడంతో, రైల్వే అండర్ బ్రిడ్జిలో భారీగా నీళ్ళు నిలిచిపోయాయి.

సుపరిపాలనలో తొలి అడుగు

ఇంటింటికి కరపత్రాలు పంచుతున్న టీడీపీ నాయకులు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ ఆదేశాల మేరకు రాష్ట్ర పద్మశాలి డైరెక్టర్ మాజీ ఎంపీపీ గంజి మాధవయ్య సూచనలు మేరకు శుక్రవారం పుత్తూరు రూరల్ మండలం, ఉత్తరపు కండ్రిగ పంచాయతీ, బూత్ నెం.86, గొల్ల కండ్రిగలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇంటింటికీ కరపత్రాలు పంచారు. ఈ కార్యక్రమంలో, రూరల్ పార్టీ అధ్యక్షుడు బాలాజీ, ప్రధాన కార్యదర్శి హేమంత్, ఉపాధ్యక్షులు విష్ణుప్రసాద్, గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పుత్తూరు పట్టణం, గ్రామీణ ప్రాంతాల్లో శనివారం ఉదయం 8.00 నుండి మధ్యాహ్నం 12.00 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని పట్టణ విద్యుత్ శాఖ ఏఈ జై సాయి, గ్రామీణ విద్యుత్ శాఖ ఏఈ భాస్కర్‌లు ఒక ప్రకటనలో తెలిపారు.

టిప్పర్ల ట్రిప్పులు.. రహదారి తిప్పలు

- అధిక లోడ్‌తో టిప్పర్ల ట్రిప్పులు
- అతి వేగంతో ప్రమాదాల భయం
- పరిసర గ్రామస్తులకు దుమ్ము బాధ
- దుమ్ము ధూళితో శ్వాసకోశ వ్యాధులు
- రోడ్లపై గోతులు..
- ఇతర వాహనాలు మరమ్మతుల పాలు

టిప్పర్లను అడ్డుకున్న సర్పంచ్‌లు, గ్రామస్తులు

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలోని క్రషర్ క్వారీల నుండి పరిమితికి మించిన లోడుతో టిప్పర్లు ఎడాపెడా తిరుగుతూ, దుమ్ము రేపుతూ స్థానికులను ఇబ్బంది పెడుతున్నాయి. టిప్పర్ల తిరుగుడు ఎక్కువవడంతో రోడ్లు ఛిద్రమవుతున్నాయి. ఈ టిప్పరు లారీలను మూడు పరిసర గ్రామాల ప్రజలు, సర్పంచులు రామ్మూర్తి, వేణు గోపాల్ రెడ్డి, ప్రసాద్ పాల్ అడ్డుకున్నారు. పుత్తేరి, పెళ్లేటివారి కండ్రిగ, ఆలత్తూరు గ్రామాల ప్రజలు టిప్పర్ల తిప్పలు తప్పించాలని నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆలత్తూరు పరిసర ప్రాంతాల్లో ఉన్న క్వారీల నుండి వివిధ ప్రాంతాలకు పెద్ద ఎత్తున దుమ్ము, కంకర, వ్యర్థాలు వంటివి తరలిస్తుండటంతో గ్రామీణ రోడ్లు గుంతలమయమై ధ్వంసమవుతున్నాయి. దీంతో పరిసర జనావాస ప్రాంతాలు దుమ్ము, ధూళితో నిండిపోతున్నాయి. ఈ వాహనాలకు పైన పరదాలు కప్పకపోవడం, ఇవి తిరిగే రోడ్లపై మార్జిన్ల వెంబడి నీళ్ల చల్లాలనే ఆదేశాలను వారి యాజమాన్యం పాటించకపోవడంతో, దుమ్ము వ్యాపించి శ్వాసకోశ సమస్యలతో స్థానికులు బాధపడుతున్నారు. రవాణా శాఖ అధికారులు చూసీ చేడనట్లు వ్యవహరిస్తున్నారని విమర్శిస్తున్నారు. టిప్పర్లపై పరదాలు కప్పక పోవడంతో వ్యర్థాలు రోడ్లపై పడి అపరిశుభ్రతకు కారణమవుతున్నాయి. అపరిమి లోడ్‌తో వేగంగా తిరుగుతున్న టిప్పర్లతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని పరిసర గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇతర వాహన చోదకులు టిప్పర్ ఎదురైతే ఆగి, అతి జాగ్రతగా వెళ్లాల్సి వస్తోందని తెలిపారు. వాహనాల తాకిడికి రోడ్లపై గుంతలు పడిపోయి బస్సు, ఆటోలు ప్రయాణించడం కష్టంగా మారింది. తరచూ వాహనాలు మరమ్మతులకు గురవుతున్నాయని ఆటో యజమానులు తెలిపారు. గ్రామాల్లో ప్రజలకు ఏదైనా ఇబ్బంది కలిగితే 108, 104 వాహనాలు కూడా రావడం లేదని, ఆ రోడ్డుపై నడుస్తున్న స్కూల్ బస్సులు కూడా తరచూ మరమ్మతులకు గురవుతున్నాయన్నారు. సంబంధిత అధికారులు స్పందించి, అధిక లోడ్‌తో వేగంగా వెళుతున్న టిప్పర్లను నియంత్రించాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో వేణుగోపాల్ రెడ్డి, యనమల ప్రసాద్పాల్, చిన్నికృష్ణ, లక్ష్మీనారాయణ, సుధీర్ రెడ్డి గ్రామస్తులు పాల్గొన్నారు.

నవోదయ ప్రవేశ పరీక్షకు దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి - క్యాంపస్ : 2026 - 2027 విద్యా సంవత్సరానికి జవహర్ నవోదయ విద్యాలయాలలో 6,9,11 తరగతుల్లో ప్రవేశాలకు నిర్వహించే పరీక్షలకు దరఖాస్తుల ప్రక్రియ, పరీక్ష విధానం పూర్తి సమాచారం విశ్వం పోటీ పరీక్షల సమాచార కేంద్రంలో పొందవచ్చని కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షులు డా. యన్. విశ్వనాథ్ రెడ్డి తెలిపారు. 6వ తరగతి ప్రవేశ పరీక్షకు విద్యార్థులు 2025-26 విద్యా సంవత్సరంలో 5వ తరగతిలో చదువుతూ ఉండాలి. వారు 2014 మే 1 నుంచి 2016 జూలై 31 మధ్య జన్మించి ఉండాలి. దరఖాస్తుల సమర్పణకు గడువు 2025 ఆగస్టు 13వ తేదీ. అలాగే 9వ తరగతి ప్రవేశానికి విద్యార్థులు 2025-26 విద్యా సంవత్సరంలో 8వ తరగతిలో చదువుతూ ఉండాలి. వారు 2011 మే 1 నుంచి 2013 జూలై 31 మధ్య జన్మించి ఉండాలి.11వ తరగతి ప్రవేశానికి విద్యార్థులు 2025-26 విద్యా సంవత్సరంలో 10వ తరగతిలో చదువుతూ ఉండాలి. వారు 2009 జూన్ 1 నుండి 2011 జూలై 31 మధ్య కాలంలో జన్మించి ఉండాలి. 9 మరియు 11వ తరగతి ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకునే విద్యార్థులు 2025 సెప్టెంబర్ 23వ తేదీ లోపు దరఖాస్తు చేయవలసి ఉంటుంది. ప్రవేశ పరీక్ష 2026 ఫిబ్రవరి 7వ తేదీన నిర్వహించబడుతుంది. మరిన్ని వివరాలకు 8688888802 / 9399976999 నంబర్లను, వరదరాజనగర్ లోని విశ్వం సైనిక్ నవోదయ పోటీ పరీక్షల కేంద్రంను సంప్రదించగలరు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : స్థానిక ఎస్‌కెఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రాష్ట్ర జి.సి.జి.టి.ఎ రాష్ట్ర నాయకత్వ పిలుపు మేరకు అధ్యాపకులు, దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న వివిధ సమస్యల పరిష్కరించాలని నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. అధ్యాపక బదిలీలు, జీవో నెంబర్ 42 రద్దు, రీ డెసిగ్నేషన్, ఇతర సమస్యలపై శుక్రవారం నుండి నిరసన కార్యక్రమాలు ప్రారంభించారు. 11 నుండి 14వ తేది వరకు భోజన విరామ సమయంలో నిరసన ప్రదర్శనలు, విజయవాడ ధర్నా చౌక్‌లో జరు పతామని, 18న రాష్ట్ర స్థాయి ధర్నా ఉంటుందని తెలియజేస్తూ ప్రిన్సిపాల్ డాక్టర్ కే.శివ ప్రసాద్‌కి విజ్ఞాపన పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నారాయణ రాజు, జిసిజిటిఏ సభ్యులు కోటేశ్వరరావు, లక్ష్మి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

వర్షాల్లో అప్రమత్తంగా ఉండండి : కమిషర్ మౌర్య

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: నగరంలో కురుస్తున్న వర్షాల పట్ల నగరపాలక సంస్థ అధికారులు, సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కమిషనర్ ఎన్.మౌర్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏదైనా ఇబ్బంది ఎదురైతే టోల్ ఫ్రీ నెంబర్ 0877 - 2256 766, 9000822909 నంబర్లను సంప్రదించాలని తెలిపా రు. గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలలో ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా నగరపాలక సంస్థ కార్యాలయంలో టోల్ ఫ్రీ నంబర్ ఏర్పాటు చేశామన్నారు. 24 గంటలు సిబ్బంది అందుబాటులో ఉంటారని, వర్షాల వల్ల ఏవైనా ఇబ్బందులు వస్తే టోల్ ఫ్రీ నెంబర్ 0877 - 2256766, 9000822909 నంబర్లను సంప్రదించాలని తెలిపారు. నగరంలోని ఆయా వార్డుల్లోని అధికారులు, సిబ్బంది స్పందించి సాయం అందిస్తారని కమిషనర్ ఆ ప్రకటనలో తెలిపారు. కాగా శుక్రవారం సాయంత్రం రెవెన్యూ ఆఫీసర్ సేతుమాధవ్, మేనేజర్ హాసీమ్‌లు టోల్ ఫ్రీ సెంటర్‌ను పరిశీలించారు.

డ్రోన్ కెమెరాలతో అసాంఘిక కార్యకలాపాలకు చెక్

ప్రజాశక్తి - రేణిగుంట: తిరుపతి జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు శుక్రవారం ఎస్సై నాగరాజు, సిబ్బందితో కలిసి రేణిగుంట పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రోన్ కెమెరాల సహాయంతో ఖాళీ స్థలాలను, బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించడం, గంజాయి వినియోగం, మల్లిమడుగు రిజర్వాయర్ పరిసర ప్రాంతాల్లో ఇతర అసాంఘిక కార్య కలపాలను గుర్తించామని తెలిపారు. నేరాలు అరికట్టడమే డ్రోన్ తనీఖీ ముఖ్య ఉద్దేశ్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీసులు పాల్గొన్నారు.

ఘనంగా వరలక్ష్మీ వ్రతం

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయ ఆస్థాన మండపంలో శుక్రవారం వరలక్ష్మీ వ్రతం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ఏపీ, తెలంగాణ వ్యాప్తంగా టిటిడికి చెందిన 52 ఆలయాల్లో 8 లక్షల గాజులు, 1.60 లక్షల కంకణాలు, 1.60 లక్షల పసుపు దారాలు, 1.60 లక్షల కుంకుమ ప్యాకెట్లు, లక్ష్మీ అష్టోత్తర శతనామావళి పుస్తక ప్రసాదాలను అందించారు.

రాయలచెరువుపేటలో.. ప్రజాశక్తి - రామచంద్రపురం : మండలంలోని రాయలచెరువుపేటలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు మేకల తిరుమలరెడ్డి, మాధవిరెడ్డిల స్వగృహంలో శుక్రవారం వరలక్ష్మీ వ్రతం ఘనంగా నిర్వహించారు. ఈ వరలక్ష్మీ వ్రతం పూజల్లో మహిళ భక్తులు, సీరియల్ నటీనటులు విశేషంగా పాల్గొన్నారు.

డి ఫార్మసీ అడ్మిషన్లకు దరఖాస్తు చేసుకోండి

ప్రజాశక్తి - క్యాంపస్ : తిరుపతి, శ్రీ పద్మావతి మహిళా పాలిటెక్నిక్ కాలేజీకి ఐఎస్ఓ సర్టిఫైడ్, ఎంబీఏ ఎన్బీఏ అక్రెడిటెడ్, పిసిఐ అప్రూవ్, ఎస్బిఐటేట్ గుర్తింపు ఉందని ప్రిన్సిపల్ డాక్టర్ పద్మావతమ్మ తెలిపారు. ఈ కాలేజీలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆగస్టు 9 నుండి 19 వరకు స్వీకరించబడతాయని, ఇంటర్మీడియట్‌లో ఎంపిసి, బైపిసి కోర్సులలో ఉత్తీర్ణత సాధించిన ఆసక్తి గల విద్యార్థినులు నేరుగా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. విద్యార్థినులకు ఉచిత హాస్టల్ వసతి, భోజన సౌకర్యం కల్పించబడుతుందన్నారు. మరిన్ని వివరాల కోసం ఈ నెంబర్లను 9299008151, 9247575386, 8978993810 సంప్రదించాలని సూచించారు.

టీడీపీ బీమా మొత్తం అందజేత

టీడీపీ బీమా మొత్తం చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్

ప్రజాశక్తి - పుత్తూరు: నగరి నియోజకవర్గం, వడమాలపేట మండలం, సీతారామాపురం గ్రామానికి చెందిన సీనియర్ టీడీపీ నాయకులు వి.రాజేంద్రరావు రోడ్డు ప్రమాదంలో మృతిచెందగా.. ఆ కుటుంబాన్ని ఆదుకోవడానికి టీడీపీ ఇన్సూరెన్స్ సదుపాయం ద్వారా రూ.5లక్షల చెక్కును నగరి ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ మృతుని భార్య సరస్వతి, కుటుంబ సభ్యులకు అందజేశారు.

ఒత్తిడి నుంచి విముక్తి పొందండి

ఫ్రెషర్స్‌డేలో విద్యార్థులకు కోలాటం కర్రలు అందిస్తున్న ఎస్ఐ పవన్ కుమార్

ప్రజాశక్తి -కోట : కోట మండలం, ఎంఈఓ కార్యాలయం ముందున్న బీసీ బాలుర వసతి గృహంలో హాస్టల్ వార్డెన్ గజేంద్రబాబు ఆధ్వర్యంలో శుక్రవారం విద్యార్థులు ఫ్రెషర్స్ డే జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్థానిక ఎస్సై పవన్ కుమార్ హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా శారీరకంగా, మానసికంగా, ఉల్లాసంగా విద్యను పెంపొందించుకోవాలని తెలిపారు. హాస్టల్లో ఉన్నప్పుడు ప్రతి విద్యార్థితో ప్రేమ, అభిమానాన్ని చాటుకుని అందరితో కలిసి మెలిసి నడుచుకోవాలన్నారు. అదేవిధంగా భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకోవడానికి కష్టపడి చదువుకోవాలని పలు సూచనలు, సలహాలను అందజేశారు. నూతనంగా ఈ సంవత్సరంలో హాస్టల్లో 59 విద్యార్థులు చేరారని హాస్టల్ వార్డెన్ గజేంద్రబాబు తెలిపారు. ఎస్సై చేతుల మీదుగా విద్యార్థులకు పలు రకాల పండ్లు, కోలాటం స్టిక్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక బీసీ బాలుర వసతి గృహం హాస్టల్ వార్డెన్ గజేంద్రబాబు, గొట్టుప్రోలు హాస్టల్ వార్డెన్ రమణయ్య, గూడూరు హాస్టల్ వార్డెన్ సుబ్రహ్మణ్యం, హాస్టల్ విద్యార్థులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి-కోట: కోట మండలం, ఎన్టిఆర్ నగర్ లో జనతా క్లినిక్ ఆసుపత్రి డాక్టర్ ఎమ్. జగదీష్ ఏర్పాటు చేసిన న్యూరాలజీ ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన వచ్చింది. శుక్రవారం ఏర్పాటుచేసిన ఈ వైద్య శిబిరంలో 50 మంది రోగులు పాల్గొని పరీక్షలు చేయించుకుని, మందులను ఉచితంగా పొందారు. ఈ శిబిరానికి నెల్లూరు కిమ్స్ ఆస్పత్రి నుండి ప్రముఖ న్యూరాలజిస్ట్ డాక్టర్ వి అభినయ రెడ్డి హాజరయ్యారు. నరాలు వ్యాధి బారిన పడకుండా పలు జాగ్రత్తలను తెలియజేశారు.ఈ కార్యక్రమంలో స్థానిక జనతా క్లినిక్ డాక్టర్ ఎమ్. జగదీష్ డాక్టర్ ఉమేరా, జనతా క్లినిక్ ఆసుపత్రి సిబ్బంది ఉన్నారు.

ట్రాలీలు లేక.. ట్రాక్టర్లు వాడక

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్: పంచాయతీకి మండల అభివృద్ధి కార్యాలయం నిధులు మంజూరు చేయకపోవడంతో పారిశుద్ధ్య పనులు ఆగిపోయాయి. ప్రత్యామ్నాయం మార్గంగా పంచాయతీ మూడు చక్ర వాహనాలతో చెత్తను తరలిస్తూ సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు. కేంద్ర ప్రభుత్వం స్వచ్ఛభారత్ పథకం కింద పుత్తూరు మండలంలోని మేజర్ పంచాయతీలు తడుకు, కేబీఆర్ పురం గ్రామాలకు రెండు ట్రాక్టర్ల కొనుగోలుకు రూ13 లక్షల నిధులు మంజూరు చేసి ట్రాక్టర్ ఇంజన్లు ఇచ్చారు. కానీ వాటికి ట్రక్కులు ఇవ్వకపోవడంతో గత సంవత్సర కాలంగా వాటిని మూలన పడేశారు. మూడు చక్రాల వాహనాలతో చెత్త తరలింపు ఆలస్యమై,

గ్రామాలు అపరిశుభ్రంగా మారుతున్నాయని స్థానికులు తెలిపారు. ఇకనైనా ప్రభుత్వం స్పందించి ఇచ్చిన ట్రాక్టర్లకు ట్రక్కులు మంజూరు చేయాలని కోరుతున్నారు.

మా పంచాయతీలో 16 గ్రామాలున్నాయి. ఈ గ్రామాల్లో మొత్తం చెత్త తొలగించాలంటే మూడు చక్రాల తోపుడు వాహనాలతో చాలా సాధ్యంకాదు. ఈ సమస్యను దృష్టిలో ఉంచుకుని అధికారులు ఇచ్చిన ట్రాక్టర్ ఇంజన్లకు ట్రాలీలు మంజూరు చేయాలి.

- వై.నందయ్య, తడుకు ఎగువ గూళూరు

గతంలో పారిశుద్ధ్య నిర్వహణకు ఇచ్చిన ట్రాక్టర్లకు, ట్రాలీలు లేని విషయం వాస్తవమే. ట్రక్కుల కొనుగోలుకు ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు కావాల్సి ఉంది. మంజూ రైన వెంటనే ట్రాలీలు కొనుగోలు చేస్తాం.

- వాణి, మండల ఇన్ఛార్జి అభివృద్ధి అధికారిణి

IN THE COURT OF THE II ADDITIONAL
CIVIL JUDGE (JUNIOR DIVISION)
TIRUPATI
O.S No.181 / 2024
P.Dharmaiah ...Plaintiff
Vs
A.Nagarani and others ...Defendants
Suit summons to the Defendant No.3 :
A.Balasankar, S/o A.Subramanyam,
R/o Flat No.502, Padmavathi Homes Apartment, Yogimallavaram, Tiruchanur, Tirupati Rural Mandal, Tirupati district.
Take notice that our client filed the above suit, for the relief of permanent injunction, to restrain you and others, from in any way interfering with his peaceful possession and enjoyment of his property. The said suit stands posted for your appearance on 18/08/2025, at 10:30 a.m., and you have to appear either in person or through an advocate, failing which the matter will be decided exparte.
Hearing date : 18/08/2025
G.SRINIVASULU GOUD
G.JYOTSNA
Advocates, Tirupati, Ph: 9966988228

IN THE COURT OF THE X
ADDITIONAL DISTRICT JUDGE ::
TIRUPATI
Arb.O.P.No. 345 / 2024
Between
APSPDCL, rep., by its Chief General Manager (Projects), Near Srinivasa Kalyana Mandapam, Tirchanoor Road, Tirupati.
........Petitioner
And
Dongfang Electronics Pvt. Ltd., Rep., by its Sourcing head and Special Power Of Attorney Holder Sri.Hanmanth Deshmukh, With Regd. Off: At plot:772, Udhyog Vihar, Phase-V, Gurgaon, and another
....Respondents
NOTICE TO THE RESPONDENT NO.1
Dongfang Electronics Pvt. Ltd., Rep., by its Sourcing head and Special Power Of Attorney Holder Sri.Hanmanth Deshmukh, With Regd. Off: At plot:772,Udhyog Vihar, Phase-V, Gurgaon, Haryana-122016, India.
Sir,
Please take Notice that the above Petition has been posted on 19-08-2025 for your appearance. Please attend on that day before the above said Court by 10-30 A.M. either in person or through your Advocate and file your objections if any. Otherwise, the matter will be decided exparte.
P.BALARAM, B.Com.,B.L.,
M.RAMACHANDRA REDDY,
ADVOCATES – TIRUPATI
Cell No.9948156064

క్రైం న్యూస్

కుక్కల దాడిలో పొట్టేళ్లు మృతి

ప్రజాశక్తి - శ్రీకాళహస్తి రూరల్ (తొట్టంబేడు): మండలంలోని తాటిపర్తి పంచాయతీ, మల్లి గుంటలో గురువారం రాత్రి కుక్కల దాడిలో పొట్టేళ్లు మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే కోగిల సుధాకర్ పొట్టేళ్లను మేపుకొని వచ్చి గురువారం సాయంత్రం దొడ్డిలో కట్టేశారు. అందరూ నిద్రిస్తున్న సమయంలో కుక్కలు ఒక్కసారిగా మూకుమ్మడిగా దాడి చేయడంతో ఎనిమిది పొట్టేలు మృత్యు వాతపడ్డాయి. వాటితో పాటు ఐదు పొట్టేలు గాయపడ్డాయి. విషయం తెలుసుకున్న పశుసంవర్ధక శాఖ ఏ.డి గోవిందరాజు భాస్కర్, తొట్టంబేడు పశుసంవర్ధక శాఖ వైద్యురాలు ప్రియాంక ఆ గ్రామానికి వెళ్లి మృతి చెందిన పొట్టేళ్లను పరిశీలించారు. అనంతరం వారు ఈ విషయాన్ని ఎమ్మార్వో, ఎం.పీ.డీ.వోలకు తెలియజేసి నష్టపోయిన రైతుకు ప్రభుత్వం నుంచి నష్టపరిహారం అందేలా కృషి చేయాలని కోరారు. పొట్టేళ్లను మేపుకొని కుటుంబాన్ని పోషించుకుంటున్న కోగిల సుధాకర్ ఈ సంఘటన వలన సుమారు రెండు లక్షల రూపాయల వరకు నష్టపోయారని, ప్రభుత్వం వెంటనే ఆదుకుని ఆ కుటుంబానికి అండగా నిలవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

గంజాయి తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్

ప్రజాశక్తి - గూడూరు టౌన్ :గూడూరు ఒకటవ పట్టణ పరిధిలోని రైల్వే క్వార్టర్స్ దగ్గర గంజాయి తరలిస్తున్న ముద్దాయిలను 1టౌన్ పోలీసులు అరెస్టు చేశారు. ఎస్ఐ తిరుపతయ్య తెలిపిన వివరాల మేరకు గూడూరుకు చెందిన పాలేపు హనుమంతు, పర్వతాల గణేష్‌లు ఇద్దరు కలిసి 600 గ్రాములు బరువు ఉన్న 33 గంజాయి ప్యాకెట్లను తరలిస్తుండగా పట్టుకున్నామన్నారు. వీటి విలువ 16 వేల ఐదువందల రూపాయలు ఉంటుందన్నారు. గంజాయి పొట్లాలను స్వాతి మెడికల్ షాప్, సి.వి.సి మెడికల్ షాప్ మధ్య ఉన్న సన్నని సందులో దాచి పెట్టి విక్రయిస్తున్నారని తెలిపారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు నయీంతో పాటు ఇతరులను గుర్తించమని వారిని త్వరలోనే అరెస్ట్ చేస్తామన్నారు.

ఎర్రచందనం దుంగలు స్వాధీనం

- ముగ్గురు స్మగ్లర్లు అరెస్టు

ప్రజాశక్తి-తిరుపతి (మంగళం) : శేషాచలం అటవీ పరిధి సత్యవేడు అటవీ ప్రాంతం జంబుకేశ్వరపురంలో ముగ్గురు ఎర్రచందనం స్మగ్లర్లును అరెస్టు చేసి, వారి నుంచి 24 ఎర్రచందనం దుంగలు, రెండు మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు టాస్క్ ఫోర్స్ పోలీసులు తెలిపారు. టాస్క్ ఫోర్స్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆర్ఐ సాయి గిరిధర్ కు చెందిన ఆర్ఎస్ఐ టీ.విష్ణువర్ధన్ కుమార్ బందం గురువారం సత్యవేడు అటవీ పరిధిలో స్థానిక ఎఫ్బీఓ కె.వేణుగోపాల్ తో కలసి కూంబింగ్ చేపట్టారని అధికారులు తెలిపారు. శుక్రవారం తెల్లవారుజామున జంబుకేశ్వరపురం నీలగిరి తోటకు చేరుకోగా అక్కడ రెండు మోటారు సైకిళ్ళుతో కొంతమంది వ్యక్తులు కనిపించారన్నారు. వారిని చుట్టుముట్టే ప్రయత్నం చేయగా వారు పారిపోసాగారని, వెంటబడి ముగ్గురు స్మగ్లర్లను అదుపులోకి తీసుకున్నామన్నారు. వీరిలో ఒకరు తిరుపతి జిల్లా, ఇద్దరు తమిళనాడు రాష్ట్రానికి చెందినవారుగా గుర్తించామన్నారు. దీనిపై ఎస్సై రఫీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

చెక్కులు అందిస్తున్న చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని

ప్రజాశక్తి - రామచంద్రాపురం:తిరుపతి రూరల్ మండలం, తనపల్లి రోడ్డు, రఘునాథ్ రిసార్ట్స్, తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో తిరుపతి, పాకాల, చంద్రగిరి, రామచంద్రాపురం, చిన్నగొట్టుగల్లు, యర్రావారిపాలెం మండలాలకు సంబంధించిన 23 మందికి సిఎంఆర్ఎఫ్ ద్వారా సుమారు 23 లక్షల 17 వేల 298 రూపాయల చెక్కులను ఎమ్మెల్యే పులివర్తి నాని శుక్రవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.